విశాలాంధ్ర
కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు
గురువారం 26 డిసెంబరు 2024 8 పేజీలు

శత వసంతాలకు ముస్తాబైన 'సీపీఐ' కార్యాలయాలు

- నేడు జిల్లాలో ప్రదర్శనలు, సభలు
- గుంటూరు కార్యక్రమానికి సీపీఐ రామకృష్ణ హాజరు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సీపీఐ శ్రేణులు సమాయత్తమయ్యారు. గుంటూరు జిల్లాలోని పార్టీ కార్యాలయాలకు రంగులు దిద్ది... విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. జిల్లా కార్యాలయంతో పాటు గుంటూరు నగరంలోని ఆయా డివిజన్‌లలో ఉన్న కార్యాలయాలు, నియోజకవర్గ కార్యాలయాలు అరుణవర్ణంలో మెరిసిపోతున్నాయి. శత వార్షికోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 26న ప్రదర్శనలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించేందుకు శ్రేణులు సిద్ధమయ్యారు. దానిలోభాగంగా గుంటూరులో ఎర్రదండు ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ ఏర్పాటు చేశారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుంచి గాంధీపార్కు వరకు ప్రదర్శన జరుగనుంది. అనంతరం అక్కడ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. వందేళ్ల సీపీఐ పోరాట చరిత్రను ప్రజలకు వివరించనున్నారు. అదేవిధంగా ఆనాటి నుంచి ఈనాటి వరకు సీపీఐ జెండా పట్టుకుని ప్రయాణం చేసిన 75యేళ్లు నిండిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐది కీలక పాత్ర

శత వార్షికోత్సవ గోడప్రతుల ఆవిష్కరణలో జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సీపీఐ వందేళ్ల(1925-2025)ను పురస్కరించుకుని శత వార్షికోత్సవ గోడప్రతులను గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి ఈ నెల 26వ తేదీతో 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతుందని తెలిపారు. కుల పీడన, ఆర్థిక దోపిడీ లేని సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా... దున్నేవాడికే భూమి... ప్రకృతి సృష్టించిన సంపద అన్ని వర్గాలకు సమానంగా పంచాలని ఎన్నో సమరశీల పోరాటాలను నడిపిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందని అన్నారు. అలాగే నివేశన స్థలాలు, బ్యాంకుల జాతీయకరణ, తెలంగాణ సాయుధ పోరాటం, దేశంలో లౌకిక వ్యవస్థను పటిష్టవంతం చేయడానికి, ప్రజాస్వామ్య రక్షణ కోసం సీపీఐ విరోచితమైన ఉద్యమ పాత్ర పోషించిందని గుర్తు చేశారు. సువర్ణ అక్షరాలతో లిఖించదగిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ శత వార్షికోత్సవాలను 2025 సంవత్సరమంతటా వాడవాడల నిర్వహిస్తారని, సభలు, సమావేశాలు, పతాకావిష్కరణలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఆనాటి నుంచి ఈనాటి వరకు సీపీఐ జెండా పట్టుకుని ప్రయాణం చేసినటువంటి 75 సంవత్సరాలు నిండిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తా ఉన్నామని తెలియజేశారు. నరేంద్ర మోదీ కుట్రపూరితంగా ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే ఎన్నిక, ఒకే పాలన ఒకే మతం ఉండాలని, అధ్యక్ష ఎన్నికల తరహా ఎన్నికలు జరగాలని, పైశాచికంగా జమిలి ఎన్నికలు తెరపైకి తీసుకురావడం జరిగిందని విమర్శించారు. ఈ జమిలి ఎన్నికలు చంద్రబాబుకు, జగన్‌మోహన్ రెడ్డికి నష్టమే అయినప్పటికీ కేసులకు భయపడి కాదంటే జైలుకు వెళ్లాల్సి వస్తుందని మోదీకి వత్తాసు పలుకుతున్నారని అన్నారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని, ఈ ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని అన్నారు. ప్రజలందరూ కూడా జమిలి ఎన్నికలను ఖండించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డి ఖండిస్తారా... లేక మోదీకి తొత్తులుగా మారతారా తేల్చుకోవాలని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి ఈ నెల 26వ తేదీతో 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా గుంటూరు నగరంలోని స్థానిక బీఆర్ స్టేడియం నుంచి గాంధీ పార్కు వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పాల్గొంటారని, కావున పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, సానుభూతిపరులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, నాయకులు చినపోతుల శ్రీనివాసరావు, పి.జగన్నాథం, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ స్వర్ణోత్సవ సంబరాలు నేటి నుంచి..

విశాలాంధ్ర-దాచేపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 1925లో ఆవిర్భవించి 99 ఏళ్ళు పూర్తి చేసు కొని వందో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా గురువారం నుంచి దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణులు స్వర్ణోత్సవ సంబరాలకు సిద్ధమయ్యారు. ఈ శత వసంతాల వేడుకలను ఏడాది పాటు నిర్వహించాలని పార్టీ జాతీయ సమితి నిర్ణయించింది. దేశంలో నూరేళ్ళ చరిత్ర కలిగిన రాజకీయ పార్టీల్లో సీపీఐతో పాటు కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఉన్నాయి. అయితే సీపీఐ మాత్రం పేదల భుక్తి కోసం, భూమి కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఘన చరిత్ర ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అనేక మంది త్యాగాలు చేశారు, ఆస్తులు పోగొట్టుకున్నారు, జైళ్ళకు సైతం ఎంతో మంది వెళ్ళారు, ప్రాణాలను కూడా తృణప్రాయంగా పోగొట్టుకున్నారు. అదేవిధంగా స్వాతంత్ర్యానంతరం కూడా పేదలు, కష్టజీవులు, కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, మహిళలు ఇలా ఎంతో మంది అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడటం, వారి వారి సమస్యల పరిష్కారం కోసం

ఎర్రదండుతో దాచేపల్లిలో మహా ప్రదర్శన

ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలు చేసిన ఘన చరిత్ర ఎర్ర జెండాకు దక్కింది. 1940 ప్రాంతంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మహత్తరమైన తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపింది. దాని ఫలితంగా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు ఎర్రదండు పంచి పెట్టింది. దొరలు, జమిందార్ల దోపిడీ, దుర్మార్గాలను ప్రతిఘటించిన ఎర్ర సైన్యంలో 4500 మందికి పైగా తమ ప్రాణాలనుఅర్పించారు. కృష్ణా నది నీళ్లు తాగిన దాచేపల్లి పరివాహక ప్రాంత ప్రజలు ఈ ఎర్ర జెండా నీడన ఎన్నో ఉద్యమాలు చేశారు. ఆ పోరాట పటిమతోనే పోరుషాల పురిటిగడ్డగా దాచేపల్లి సహా పల్నాడు ప్రాంతానికి పేరొచ్చింది. ప్రజా పోరాటాలకు ఇక్కడి కృష్ణా నదీ తీర గ్రామాల్లో

మిగతా 2లో

దీక్షా విరమణ పనులు వేగవంతం చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : భవాని దీక్షల విరమణ ఆఖరి రోజు వల్ల యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉన్నందున వీఎంసీ సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉంటూ పనులు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. రాత్రి ఒంటి గంటకు కృష్ణవేణి ఘాట్, సీతమ్మ పాదాలు, హోల్డింగ్ ఏరియా, వినాయకుని గుడి, కెనాల్ రోడ్, దుర్గా ఘాట్, మోడల్ గెస్ట్ హౌస్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి భవాని దీక్ష విరమణను పరిశీలించారు. భవాని దీక్ష విరమణకు వచ్చిన యాత్రికులు తాకిడి అధికంగా ఉండటంతో రాత్రి వేళలో వీఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఆయా పనులు వేగవంతం చేసి యాత్రికులకు ఎలాంటి లోపం లేకుండా చూడాలన్నారు. భవాని దీక్ష విరమణలో యాత్రికులు తీసే దుస్తులను ఎప్పటికప్పుడు కన్వేయర్ బెల్ట్ ద్వారా తీసివేయాలని, అవసరమైతే కన్వేయర్ బెల్ట్ ద్వారా తీసిన దుస్తులను వేసే ట్రక్కులను పెంచాలని అధికారులను ఆదేశించారు.

యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా, భక్తుల రద్దీగా ఉండటం వల్ల తాగునీటిని స్టాక్ పాయింట్ నుంచి వాటర్ పాయింట్ వరకు రవాణా చేసేటప్పుడు ఇంకొంచెం సమయం పడుతుంది కాబట్టి ముందుగానే అప్రమత్తంగా ఉంటూ ఆ రవాణా సమయం ఎంత పడుతుందో దానికి అనుగుణంగా ప్రణాళికను సిద్ధం చేసుకుని తాగునీటి ప్యాకెట్లను, బాటిల్లను ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దుర్గా ఘాట్ వద్ద మోడల్ గెస్ట్ హౌస్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌లో ఉండే సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరా ద్వారా జరుగుతున్న పనిని, అధికారులను, సిబ్బందిని పరిరక్షించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

విశాలాంధ్ర

ప్రేమ, శాంతిని పంచేదే క్రిస్మస్: బిషప్

విశాలాంధ్ర-ఫిరంగిపురం: సర్వ మానవాళికి కుల మతాలకు అతీతంగా ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, శాంతిని పంచుకొని సుఖ సంతోషాలతో జీవించడమే క్రిస్మస్ పండుగని గుంటూరు పీఠాధిపతులు రైట్.రెవ.డా. చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. 25వ తేదీ క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారం అర్ధరాత్రి బాలయేసు కథెడ్రల్ దేవాలయంలో దివ్యపూజాబలి కార్యక్రమాన్ని నిర్వహించిన బిషప్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమానికి ముందుగా బాలయేసు దేవాలయ విచారణ గురువులు రెవ.ఫా.ఫాతిమా మర్రెడ్డి మాలపాటి ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు కలిసి బిషప్‌ను ఘనంగా స్వాగతించి సన్మానించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి పాపముల నిమిత్తం లోక రక్షకుడిగా ఈ లోకంలో అవతరించారని తెలియజేస్తూ భక్తులకు వాక్యోపదేశం అందించారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాలను నుంచి క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ అలంకరణతో మేళ వాయిద్యాలతో బాలయేసు తేరులతో దేవాలయానికి తరలి వచ్చారు. తేరులు ప్రదర్శన ప్రజలను భక్తులను ఆకర్షింపజేశాయి.

క్రిస్మస్ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు

విశాలాంధ్ర-తెనాలి: క్రిస్మస్ సందర్భంగా తెనాలి పట్టణంలోని పలు చర్చిలలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాల్వేషన్ ఆర్మీ చర్చినందు మహిళల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. క్రీస్తు జీవిత విశేషాలను, క్రీస్తు విజయాన్ని తమ నృత్య ప్రదర్శనల ద్వారా ప్రేక్షకులను అర్థం అయ్యే శైలిలో ప్రదర్శించి వారి అభినందనలను పొందారు. బోస్ రోడ్డులోని టౌన్ చర్చిలో క్రీస్తు విజయం నాటిక ప్రదర్శించారు. చర్చిలలోని పాస్టర్లు బోధనలు చేసి ప్రార్థనలు నిర్వహించారు.

శ్రీ హరినామ సంకీర్తన బృందం గాన సంకీర్తన

విశాలాంధ్ర-తెనాలి: నెహ్రూ రోడ్‌లోని శ్రీ రుక్మిణి సమేత గోవర్ధన స్వామి దేవాలయం, శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో బుధవారం శ్రీ హరినామ సంకీర్తన బృందం వారిచే సంకీర్తన గానం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెరవలి వంశీకృష్ణ, అందె బాలచంద్రమౌళి, అందె రాజేశ్వరి, తన్మయి మాదల సాయిహనుమంతరావు, నాగఅర్చన, రూపశ్రీ, నందిపాటి దుర్గామల్లేశ్వరి, దంటు శర్వాణి, పువ్వాడ విష్ణుప్రియ, శ్రీపూజిత, కొప్పురావు అనిత మాధవి, నందికంటి జయలక్ష్మి, పూజిత, టీవీఎస్ శాస్త్రి, సంకీర్తనలలో పాల్గొన్నారు. శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతివారం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానములు సంయుక్త ఆధ్వర్యంలో గోవర్ధనస్వామి దేవాలయంలో వారం భజన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 27న తిరుమలలో ఈ బృందంచే భక్తిరంజని ఉంటుందని గురువు పెరవలి వంశీకృష్ణ తెలియజేశారు.

నేడు గ్రాండ్ కల్చరల్ నైట్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: హోప్ విన్ హాస్పిటల్స్, సలాం నమస్తే గుంటూరు సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 26న సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు గ్రాండ్ కల్చరల్ నైట్, ఎస్ఎన్ జీఎస్ గ్రాండ్ ఇనాగరేషన్ కార్యక్రమం జరుగుతుందని సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షమా సుల్తానా, హోప్ విన్ హాస్పిటల్స్ ఫౌండర్ డాక్టర్ నజీరుద్దీన్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన వివరాలు తెలియజేశారు. ఈ నెల 26న సాయంత్రం జరిగే కార్యక్రమానికి ప్రముఖ రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, జీజీటీ విజేతలు పాల్గొంటారన్నారు. టాలెంట్ షోలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రధానం చేయనున్నట్లు వారు వెల్లడించారు.

ప్రతి శాఖలో సీపీఐ పతాకాలు ఎగురవేయాలి

బైరాపట్నం రామకృష్ణ

విశాలాంధ్ర-అమరావతి: బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగలాడిస్తూ దేశ స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ సందర్భంగా మండల కేంద్రమైన అమరావతిలో బుధవారం సీపీఐ జెండాలు ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ భూమి కోసం.. భుక్తి కోసం... వెట్టిచాకిరి విముక్తి కోసం దేశ సమైక్యతను చాటుతూ భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వేలాది ఎకరాలు భూమిలేని చిన్నకారు రైతాంగానికి భూమి పంచిన ఘనత సీపీఐకే దక్కిందని అన్నారు. పారిశ్రామిక పెట్టుబడిదారి వర్గాలకు వ్యతిరేకంగా కార్మికులు, అసంఘటిత కార్మికుల హక్కుల కోసం నిరంతరం ఉద్యమం సాగిస్తూ వారి హక్కులు పరిరక్షించటంలో ప్రధాన భూమిక నిర్వహించిన పార్టీ సీపీఐ అన్నారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, తాడిత పీడిత ప్రజా హక్కుల కోసం నిరంతరం ఉద్యమించే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. సీపీఐ పతాకాలను ప్రతి శాఖలో ఆవిష్కరించాలని ఆయన కోరారు. సీపీఐ శత విజయోత్సవాల సందర్భంగా రానున్న సంవత్సరం సభలు, సమావేశాలు నిర్వహించేందుకు కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత మౌలిక సమస్యలకు పరిష్కార మార్గం వైపుకు తీసుకువెళ్ళేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు మేడా మల్లేశ్వరి, మల్లా మరియమ్మ, బైరాపట్నం జయలక్ష్మీ, బి.వర లక్ష్మీ, ఎం.తిరుపతమ్మ, మేడా తిరుపతమ్మ, కంద్ర కోట కోటమ్మ, పెదాల పుల్లమ్మ, కె.కృష్ణవేణి, సీపీఐ నాయకులు కె.మంత్రాలు, శీలం ముని, ఎస్.ముసలయ్య, ఎన్.రవి, ఎం.రాంబాబు, పి.వెంకటేశ్వర రావు, ఓరా గోపి, ఎ.రమేష్, ఎ.కోటేశ్వరరావు, మేడా శంకర్, నాగరాజు, శ్యాంసోన్, గాలం సాంబయ్య, ఏ.గోపి తదితరులు పాల్గొన్నారు.

భారతావని గర్వించే రాజకీయ శిఖరం వాజ్‌పేయ్: ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: స్వతంత్ర భారత చరిత్రలో గొప్ప రాజనీతిజ్ఞుడిగా, భారతావని రక్షణార్థం దేశానికి అణు కవచం తొడిగిన ధీరుడు, ప్రత్యర్థులు సైతం మెచ్చే అజాత శత్రువు, దేశ ప్రజలకు సుపరిపాలన అందించిన దార్శనికుడు, మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయ్ అని, అటువంటి మహనీయుని విగ్రహం చిలకలూరిపేట పట్టణంలో ఏర్పాటు చేయడం నియోజకవర్గానికే గర్వకారణమని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఏర్పాటుచేసిన వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. భారతావని గర్వించే రాజకీయ శిఖరం, మచ్చలేని వ్యక్తి, మకుటం లేని మహారాజు, భారతరత్న, కవి, ఉర్రూతలూగించే ప్రసంగాల్లో దిట్ట, మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయ్ విగ్రహం చిలకలూరిపేటలో నెలకొల్పడం నియోజకవర్గంతో పాటు రాష్ట్రానికే గర్వకారణమని పుల్లారావు అభిప్రాయపడ్డారు. నాటి కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా చంద్రబాబు వ్యవహరించారని, వాజ్‌పేయ్‌తో తనది ప్రత్యేక అనుబంధమని, దేశ ప్రగతికి ఉపయోగపడే ఎన్నో సూచనలు, సలహాలు ఆ మహనుభావుడికి అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. చంద్రబాబు అంటే వాజ్‌పేయ్‌కు ఎంతో మక్కువ, ఎనలేని అభిమానమని, ఈ విషయాన్ని బాబు పలు సందర్భాల్లో గుర్తుచేసుకున్నారన్నారు. వాజ్‌పేయ్ శతజయంతి వేళ చిలకలూరిపేట ప్రధాన కూడలి ఎన్ఆర్‌టీ కూడలిలో ఆ మహనీయుని విగ్రహం ఏర్పాటు చేయడం నిజంగా అభినందనీయమని, ఇంత మంచి పనికి చొరవచూపిన బీజేపీ నాయకులు అన్నం శ్రీనివాసరావు తదితరులను, విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని పుల్లారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిట్ర వెంకట శివనారాయణ, రొంగల గోపి, కొక్కెర శ్రీనివాస్, జనసేన ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమథ్ ఖాన్, కామినేని సాయి బాబు పాల్గొన్నారు.

సీపీఐ స్వర్ణోత్సవ సంబరాలు నేటి నుంచి..

(మొదటిపేజీ తరువాయి) కొదవలేదు. ఎదురొడ్డి పోరాడి సాధించుకునే సత్తా, పటిమ దాచేపల్లి నాయకత్వానికి ఆది నుంచే ఉంది. దీనిలో భాగంగానే 1950 ప్రాంతంలో కార్మిక, కర్షక రాజ్యం కోసం పోరాడిన ఎంతో మంది ప్రభుత్వ తుపాకీ గుండ్లకు అశువులుబాశారు. వారందరి గుర్తుగా 1958లో నడికూడి రైల్వే స్టేషన్ కు వెళ్ళే దారిలో నారాయణపురం లోని ప్రధాన కూడలిలో అమర వీరుల స్థూపాన్ని నిర్మించారు. ఆ స్థూపం సహ దాచేపల్లితో పాటు పల్నాటి గ్రామాల్లో ఉన్న పార్టీ కార్యాలయాలు రంగులు, బ్యానర్లు, స్వాగత తోరణాలు, విద్యుద్దీపాల అలంకరణతో పల్నాడు జిల్లా లోని జాతీయ రహదారి అంతా ఎరుపెక్కింది. గురువారం నిర్వహించే ఎర్ర జెండా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దాచేపల్లి లోని షేక్ అబ్దుల్ రసూల్ పార్టీ కార్యాలయం నుంచి నారాయణపురం లోని మందపాటి నాగిరెడ్డి కమ్యూనిటీ హాల్ వరకు వందలాది మంది ఎర్ర సైన్యం మహా ప్రదర్శన చేయనున్నారు. అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు. అందులో 70 ఏళ్ళకు పైబడిన పార్టీ కురు వృద్ధులను సన్మానిస్తారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారు. అదేవిధంగా పార్టీ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కోలా స్వాతి, మాచర్ల, గురజాల నియోజక వర్గ కార్యదర్శులు మేకపోతు శ్రీనివాసరెడ్డి, మందపాటి రమణారెడ్డి, దాచేపల్లి మండల శాఖ కార్యదర్శి కొమెర వెంకట్రావు, పార్టీ సీనియర్ నేతలు బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, వేముల వెంకటరెడ్డితో పాటు పార్టీ యంత్రాంగం అంతా తరలి రానున్నారు.

ప్రజల నడ్డి విరిచేలా విద్యుత్ చార్జీలు: రజిని

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని ఇచ్చిన హామీను తుంగలోతొక్కి ప్రజల నడ్డివిరిచేలా విద్యుత్ చార్జీలను పెంచిందని మాజీ మంత్రి విడదల రజిని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్‌లను బుధవారం ఆమె తన నివాసంలో పార్టీ శ్రేణుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ ప్రజల చేతే కరెంట్ అమ్మిస్తా అంటూ ఎన్నికలకు ముందు బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి తీరా ఆరు నెలలు తిరక్క ముందే చార్జీల భారాన్ని మోపారని మండిపడ్డారు మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ఒక్కో యూనిట్‌ని రూ.4లకే కొనుగోలు చేసి ప్రజలకు రూ.1.20లకే విద్యుత్ సరఫరా చేస్తే.. ఇప్పుడు చంద్రబాబు ఏకంగా యూనిట్‌కి రూ.1.50పైగా పెంచి చార్జీల బాదుడు బాబుగా పేరు గడించాడని ఎద్దేవాచేశారు. ఈ నవంబర్, డిసెంబర్ మాసాల్లో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం ఏకంగా రూ.15,485.36 కోట్లకు చేరిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కో పథకానికి ఖర్చు పెట్టేంత మొత్తాన్ని కూటమి ప్రభుత్వంలో ఒక్క విద్యుత్ చార్జీల పేరుతోనే వసూలు చేస్తుందని ఆగ్రహించారు. డిస్కంల పేరుతో 2014 నుంచి 2019 వరకు రూ.29 వేల కోట్లను రూ.84 వేల కోట్లకు చేర్చిన అప్పుల పాలనా చరిత్ర ఒక్క చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి సర్కార్ విద్యుత్ భాగోతం ప్రతీ ఒక్కరికి తెలియాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. పట్టణంలోని ఆర్టీసి బస్‌స్టేషన్ వెనుక ప్రాంతంలో ఉన్న విద్యుత్ ఏడీఈ కార్యాలయం వద్ద ఈ నెల 27న జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పట్టణం సహా మూడు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సానుభూతిపరులు పెద్దఎత్తున పాల్గొని ప్రభుత్వానికి నిరసన గళం వినిపించాలని ఆమె విజ్ఞప్తిచేశారు.

చర్చి ప్రహరీకి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-తాడేపల్లి : క్రిస్మస్ పండుగ సందర్భంగా నారా లోకేష్ స్ఫూర్తితో పెనుమాకలో రారాజు ప్రార్ధనా మందిరం ప్రహరీ గోడ ఫ్లాస్టింగ్ కోసం రూ. 20 వేలను టీడీపీ తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు అందజేశారు. అలాగే నారా లోకేష్ పాస్టర్‌లకు ఇచ్చిన నూతన వస్త్రాలను పాస్టర్ ప్రణయ్ భాస్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కొల్లిశేషు మాట్లాడుతూ పెనుమాక గ్రామ క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవులకు మెరుగైన సంక్షేమం అందించి వారి పురోగతికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేసారు. గ్రామ టీడీపీ అధ్యక్షులు పాలెపు వీరేంద్రనాద్(బాబి), పఠాన్ జానీ ఖాన్, దోలా కళ్యాణ్, గుండాల రామారావు, గుండాల యేసు, గుండాల ప్రసాద్, కత్తి మరియమ్మ, గుండాల మునెమ్మ, సంఘస్థులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేడు వంగవీటి రాధా మంగళగిరి రాక

విశాలాంధ్ర-మంగళగిరి : నగరంలోని పలు కార్యక్రమాలలో టీడీపీ నాయకులు వంగవీటి రాధాకృష్ణ గురువారం పాల్గొనున్నారు. ముందుగా దివంగత నేత పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా మధ్యాహ్నం 3.30 గంటలకు మంగళగిరి పట్టణంలోని నగరపాలక సంస్థ ఎదురుగా గల రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి అక్కడ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు రంగశెట్టి నరేంద్ర(బాబి) తెలిపారు.

వాజ్‌పేయి శతజయంతి

విశాలాంధ్ర-మంగళగిరి : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతిని బీజేపీ సీనియర్ నాయకులు మైల శ్రీనివాసరావు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ రాజకీయాలలో వాజ్‌పేయి చెరగని ముద్ర వేశారని ఆయన అన్నారు. ఎంతటి క్లిష్టమైన విషయాన్ని అయినా సరళ భాషలో సామాన్యులను సైతం ఆకట్టుకోగల అసాధారణ వక్త వాజ్‌పేయి అని కొనియాడారు. పదవుల కోసం తాపత్రయ పడకుండా నైతికతకు కట్టుబడి పదవులనే త్యాగం చేసిన మహోన్నతుడు వాజ్‌పేయి అని అన్నారు. నేటితరం రాజకీయ నాయకులకు వాజ్‌పేయి ఆశయాలు జీవితాచరణ ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. అంబేద్కర్ సెంటర్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గండికోట కోటేశ్వరరావు, రాచకొండ కోటేశ్వరరావు, మొహమటం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భారత గడ్డపై సీపీఐకి వందేళ్లు..

విశాలాంధ్ర-మంగళగిరి : బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వేచ్ఛ కోసం, సంపూర్ణ స్వాతంత్రం కోసం మహోజ్వల పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదేనని, ఈ పోరాట పార్టీకి నేటితో 99నిండి 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంలో మంగళగిరి భారత కమ్యూనిస్టు పార్టీ శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ భవన్ ఎదుట గురువారం సాయంత్రం ఐదు గంటలకు బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు జరిగిన మహోజ్వల పోరాటాలను ప్రజలకు వివరిస్తారని, దున్నే వాడికే భూమి, ఎనిమిది గంటల పని విధానం, భాషా ప్రయోక్త రాష్ట్రాలు లాంటి విషయాలు ఎలుగెత్తిచాటిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ వర్గ దోపిడీ, కుల వ్యవస్థ, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలకు పోరాటం నేర్పిందన్నారు. 10 లక్షల ఎకరాలను తెలంగాణ రాష్ట్రంలో పేదలకు పంచిందని, ఉద్యోగ భద్రత కోసం, సామాజిక పెన్షన్ల లాంటి సంక్షేమ కార్యక్రమాలను సాధించిందని తెలిపారు. సామాన్యులకు కావలసిన మౌలిక అవసరాల కల్పనలో అనేక పోరాటాలు సల్పిందన్నారు. మార్క్సిజాన్ని, సోషలిజాన్ని, శాస్త్రీయ దృక్పథ ఆలోచనలను దేశ ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ పరిచయం చేసిందన్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని నాజీయిజాన్ని ఎదిరించి తుపాకి తూటాలకు ఎదురొడ్డి ఉరితాళ్లను ముద్దాడి బలిదానమైన పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని అన్నారు. కార్మిక కర్షక, తాడిత, పీడితుల పక్షాన నిలిచిన పార్టీ అని దేశంలోని సంస్థానాలను విలీనం చేయాలని పోరాటం చేసి విజయం సాధించిన పార్టీ అని, అలాగే దేశంలోని కార్మికుల పక్షాన రైతులు పక్షాన, ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసి ప్రణాళికబద్ధమైన ఆర్థిక ప్రగతి కోసం పూర్తిస్థాయిలో భారత కమ్యూనిస్టు పార్టీ పోరు చేసిందన్నారు. నియోజకవర్గంలోని పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, కళాకారులు, కార్మికులు వివిధ రంగాల్లో పనిచేసే వర్కర్‌లు, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు అందరూ కూడా బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు దాటిన పార్టీ సభ్యులకు సన్మానిస్తారని తెలియజేశారు.

నేడు మంగళగిరిలో బహిరంగ సభ

క్రీస్తు జీవితం స్ఫూర్తిదాయకం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఏసు క్రీస్తు జీవితం, బోధనలు అందరికీ స్ఫూర్తిదాయకమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. బుధవారం గుంటూరు లాడ్జి సెంటర్ నందుగల నార్త్ ప్యారిష్ చర్చి నందు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలోని పాస్టర్లు ఆమెకు దీవెనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ... క్రీస్తు మార్గంలో అందరి జీవితాలు సుఖశాంతులతో ఫరిడవిల్లుతాయని, ప్రజలు సంతోషంగా క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఏసు జీవితం ఆదర్శప్రాయం: ఫాతిమా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : లోక రక్షకుడైన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తూర్పు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 57వ డివిజన్ గడ్డిపాడు లోదరన్ చర్చిలో 12వ డివిజన్ వైసిపి నాయకులు నందేటి రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో నూరి ఫాతిమా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దైవ కుమారుడు ఏసుక్రీస్తు బోధనలు మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా మార్గనిర్దేశం చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, సలీం, రాజు, నరేంద్ర, శ్యామ్, కిరణ్, రాజారావు పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద వైద్యానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-దాచేపల్లి: శ్రీనగర్‌లో పులిపొంగు చిన సాగర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం రూ . 5 వేల నగదును స్థానిక వైసీపీ నాయకులు బుధవారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కూసం నాగిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

గొప్ప నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం విజయవాడ సిరి సోషల్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గుడ్ గవర్నెన్స్ డే సందర్భంగా మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజపేయి జయంతిని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 23 మొదలు 25వ తారీకు వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, వంగర శేషగిరిరావులు మాట్లాడుతూ దేశ గొప్ప నాయకులను స్మరించుకోవడం చాలా ముఖ్యమని అందులో అటల్ బీహార్ వాజపేయి ముందు వరుసలో ఉంటారని ఆయన మన మాజీ ప్రధానిగా ఎన్నో సేవలు దేశానికి అందించాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కే గోవర్ధన సిరి సోషల్ సర్వీస్ సొసైటీ విబాల కోటేశ్వరి, పలువురు అతిథులు, విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు.

క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర-మంగళగిరి : శాంతిదూత మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళగిరి సైమన్ మెమోరియల్ ప్రేయర్ హాల్‌లో మంగళవారం అర్ధ రాత్రి, బుధవారం క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు, సమావేశాలు నిర్వహించారు. మినిస్ట్రీస్ ప్రతినిధులు కె.రూఫస్, కేకే రవికుమార్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. క్రీస్తు సందేశాన్ని ఆత్మకూరులోని అపోస్తలిక్ చర్చ్ పాస్టర్ ఎం.సుధీర్ అందించారు. క్రీస్తు కేవలం రెండు వేల సంవత్సరాల క్రితం జన్మించిన దైవం కాదనీ, పాత నిబంధన(ఓల్డ్ టెస్ట్‌మెంట్) కాలంలో కూడా బైబిల్‌లో మనకు దర్శనమిస్తారని అన్నారు. వివిధ అంశాలను వివరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖుల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి, రిటైర్డ్ మేజర్ వీఆర్‌కే చారి హాజరయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ రహస్యం ఏమిటంటే అహింసా, శాంతి మాత్రమేనని వారన్నారు. ఆ శాంతి మార్గమే ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

తెనాలిలో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-తెనాలి : పట్టణ పరిసర గ్రామాలలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝాము నుండి చర్చిలలో ప్రార్థనలు జరి పారు. లోకరక్షకుడిని నిరంతరం ప్రార్థించాలని తద్వారా మోక్షం కలుగుతుందని ఆయా చర్చిలలో పాస్టర్లు ప్రార్థనలు చేశారు. మానవ హృదయాలను క్రీసుకు సమర్పించడమే క్రిస్మస్ అని, ఇలాంటి క్రిస్మస్ ను ప్రపంచ వ్యాప్తంగా సంతోషంతో జరుపుకుంటారని, శాంతికి త్యాగానికి మారుపేరుగా ఏసుక్రీస్తును అభివర్ణి స్తుంటారని, అలాంటి ఏసుక్రీస్తు జన్మదినాన్ని పండు గగా జరుపుకుంటూ ఆయనను ఆరాదించడం జరుగు తుందని పాస్టర్లు బోధ చేశారు. తెనాలి బోస్‌రోడ్డులోని టౌన్ చర్చి, చెంచుపేటలోని ఆర్‌సియం చర్చి, నిత్య సహాయమాత మందిరం (యన్‌సిఆర్‌సియం), సాల్వేషన్ ఆర్మీ చర్చి ఐతానగర్‌లోని క్రీస్తు కృపాలయం, రక్షణ సైన్యం చర్చి, మైకా చర్చి, నందు ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. తెనాలి నందివెలుగు గ్రామంలో జాషువా నగర్‌లోని ఇమ్మానియేలు ప్రార్థనాగోపురంలో రెవరెండ్ భానుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలో, తెనాలి పట్టణంలో వైయస్ఆర్ సిపి మహిళా విభాగంలో తరఫున మన్నవ శాంతిశ్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాసనసభ మాజీ సభ్యుడు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నాడు. పెదరావూరు బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సినీ దర్శకుడు దిలీప్‌రాజా ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఆయన మాట్లాడుతూ మనకున్న దాంట్లో లేనోళ్లకు సాయం చేయడంలోనే నిజమైన క్రిస్మస్ కాగలదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిరాశ్రయులకు వస్త్రాలు, భోజనాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గిరిజన బాలికలకు స్కూలు బ్యాగులను అందజేశారు. పట్టణ పరిసర ప్రాంతాలైన బుర్రిపాలెం, అంగలకుదురు తదితర ప్రాంతాలలోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకుని ప్రార్థనలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు చర్చిలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దేశానికి వాజ్‌పేయి సేవలు అజరామరం: ఉమా శంకర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారతదేశానికి మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయి అందించిన సేవలు అజరామరం అని గుంటూరు తూర్పు నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ కొనియా డారు. అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి వేడుకలు స్థానిక నాజ్ సెంట ర్ కూడలిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నజీర్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిలు డాక్టర్ ఉమా శంకర్‌తో కలిసి అఖ్మద్ అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ వాజ్ పేయి దేశానికి చేసిన సేవలకు గుర్తుగా ఆయనను భారతరత్నతో ప్రభుత్వం గౌరవించిం దన్నారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. దేశ రాజకీయాలలో అరుదైన నాయకుడు వాజ్ పేయి అని, ఆయనకు ఎవరు సాటి రారని పేర్కొన్నారు. రాజ్యసభలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ తన ప్రసంగంలో అటల్ బిహారి వాజ్ పేయి రాజకీయ భీష్మునిగా అభివర్ణించారని, వాజపేయిని శత్రువులు కూడా విమ ర్శించని గొప్ప వ్యక్తి అని కొనియా డారు. మాజీ మంత్రి డాక్టర్ శనక్కా యల అరుణ, జనసేన పార్టీ గుంటూ రు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ సహ గ్రామీణ మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక వెల్లటూరు రోడ్డులోని నారాయణ స్కూల్ ఆవరణలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ రెడ్డి, ఏజీఎం చేతులమీదుగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు క్రిస్మస్ వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హర్షవర్ధన్ రెడ్డి, ఏజీఎం లక్ష్మణ్ రెడ్డి, కోఆర్డినేటర్స్ భద్రారెడ్డి, గౌసియా, రిహాని, స్కూల్ ఇన్చార్జీలు మాధవి అనురాధ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్, విద్యార్థినీ విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - వినుకొండ: క్రిస్మస్ సందర్భంగా అఖిల్ కలాం థెరిస్సా సేవా సొసైటీ ఆధ్వర్యంలో చందోలు నాగవాణి చేతుల మీదుగా వెన్ను పూసకాల నీలో బుధవారం 100 మంది విద్యార్థులకు నూతన వస్త్రాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో పాస్టర్ నల్లబోతుల ఏసురత్నం, సిస్టర్ రీతా విజన్ (డెన్నిస్), సిస్టర్ మాణిక్యమ్మ, పునీటి సంతోషి, పెద్దేటి రాజేంద్ర ప్రసాద్, సిస్టర్ పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక నరసరావుపేట రోడ్‌లోని ఇమానియేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో క్రిస్మస్ పర్వదిన వేడుకల ఉదయం సంఘ కాపరి రేవరెండ్ డాక్టర్ స్పర్జన్ కుమార్ క్రిస్మస్ ఆరాధన దైవ సందేశం ఇచ్చారు. చర్చి సంఘ అధ్యక్షులు చాట్ల రామయ్య శుభాకాంక్షలు తెలిపారు. కే.ఆశాలత జీవన్ బైబిల్ పట్టణం అందజేశారు. ప్రముఖులు ప్రసంగించారు. సంఘ అధ్యక్షులు చాట్ల రామయ్య, సెక్రెటరీ గద్దల ఆశి వరప్రసాద్, ట్రెజరర్ పి.సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ మోజెస్ నాగస్వామి, వైస్ సెక్రటరీ కూచిపూడి వినోద్ కుమార్, సెక్రెటరీ బేతం మోజెష్, మాజీ ప్రెసిడెంట్ గద్దల ప్రేమనాథ్, ప్రకాష్, కాల్వ సుందర్రావు, మహిళా సెక్రెటరీ కె.ఆశాలత, జీవన్, గద్దల గ్రేస్ మనోహరం తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-రెంటచింతల: క్రిస్మస్ పర్వ దినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే వివిధ ప్రార్థనామందిరాలకు క్రైస్తవులు తరలివచ్చి ప్రత్యేక ఆరాధనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కోసి భక్తులకు పంపిణీ చేశారు. లోక రక్షకుడు ఏసుక్రీస్తు జనన వృత్తాంత విశేషాలను క్రైస్తవ మత పెద్దలు విశ్వాసులకు తెలియజేశారు. ప్రార్థన మందిరాల్లో విచారణ గురువులు, పాస్టర్లు, సంఘ కాపరులు దైవవాక్య సందేశాన్ని ఇచ్చారు. రెంటచింతలలోని కానుక మాత దేవాలయంలో విచారణ గురువులు అగస్టిన్, వైఎల్ మర్రెడ్డి, వేలాంగిణీ, ఎలీషా రాజు, లూథరన్ చర్చిలో పాస్టర్ దేగల దేవానందం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు ప్రవచించిన ప్రేమ, దయ, సేవా గుణాలతో సమాజం సుఖశాంతులతో వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

మహిళలు.. మహారాణులు

- దాచేపల్లికి అరుదైన గౌరవం
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు నలుగురు ఎంపిక

విశాలాంధ్ర-దాచేపల్లి : దక్షిణాది ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దాచేపల్లికి చెందిన నలుగురు మహిళలు ఎంపిక య్యారు. 2025 జనవరి 5న జరిగే సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె పేరుతో ఈ జాతీయ ప్రతిభా అవార్డు ఇవ్వనున్నారు. ఆ రోజు గుంటూరులో ఏర్పాటు చేసే సభలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితర పెద్దల చేతుల మీదుగా ఇవ్వనున్నట్లు ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగయ్య తెలిపారు.

ఈ నలుగురు ఉన్నత పాఠశాల విద్యార్థులే దాచేపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1983-84 బ్యాచ్ విద్యార్థులు. ఈ నలుగురు అందుకోనున్న జాతీయ ప్రతిభా అవార్డుల గౌరవం ఆ బ్యాచ్‌కు దక్కింది. ఈ నలుగురు పలుచోట్ల వివిధ ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. విజయరాణి హైదరాబాదులోని ఒక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రం ఉపాధ్యాయురాలుగా చేస్తున్నారు. 1999 జూలై నుంచి ఆమె ఈ రంగంలో ఉన్నారు. దాదాపు 25 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆమె ఎంతో పేరు గడించారు. కృష్ణకుమారి 32 సంవత్సరాల నుంచి విద్యా రంగంలో ఉన్నారు. ప్రస్తుతం నరసరావుపేటలోని ఓ ఉన్నత పాఠశాలలో సైన్సు టీచరుగా చేస్తున్నారు. గతేడాది గురు బ్రహ్మ అవార్డును అందుకున్నారు. రాజమండ్రిలో గోదావరి టాలెంట్ టెస్టు నిర్వాహకులు ఇచ్చారు. పద్మావతి రంగారెడ్డి జిల్లాలోని ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా చేస్తున్నారు. 20 సంవత్సరాల నుంచి అక్కడే ఉన్నారు. సుజాత 2009 నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. అప్పటి నుంచి 15 ఏళ్ళ పాటు ఈ రంగంలో ఉన్న ఆమె ప్రస్తుతం మాచవరంలో గ్రంధాలయాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దశాబ్దాల తరబడి అటు తెలంగాణ, ఇటు ఆంధ్రాలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఈ మహిళా మహారాణుల విశిష్ట సేవలను గుర్తించిన దక్షిణాది ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆర్గనైజేషన్ నిర్వాహకులు వీరిని గౌరవించి సావిత్రీబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డులు ఇవ్వనున్నారు.

ఉద్యోగులకు ప్రభుత్వం డీఏ ప్రకటించాలి

విశాలాంధ్ర - వినుకొండ : నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వినుకొండ నియోజకవర్గంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బి.వి నాగేశ్వరావు నేతృత్వంలో విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. అనంతరం అసెంబ్లీ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ని కలిసి ఉద్యోగస్తులకు నూతన పిఆర్సి కమిషన్ను నియమించి, వెంటనే మధ్యంతర భృతి ప్రకటించేలా చూడాలని, వెంటనే సరెండర్ లీవ్ ఎన్కాష్మెంట్‌కు చర్యలు తీసుకోవాలని, పదో తరగతి చిన్నారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందరోజుల ప్రణాళికలోని లోపాలను సవరించాలని, నూతన సంవత్సర శుభవేళ ఉద్యోగస్తులకు ప్రభుత్వం డీఏ ప్రకటించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పక్షాన విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి మాతంగి సాంబశివరావు, బెల్లంకొండ మండల కమిటీ కార్యదర్శి కూరపాటి రాజా, టి.ఎన్. ఏ రాష్ట్ర కార్యదర్శులు రాజ చౌదరి, సెల్వరాజ్, గుంటూరు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి విశ్వనాథ్, పి.లలిత బాబు, గుంటూరు నగర అదనపు కార్యదర్శి టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ పండుగ

విశాలాంధ్ర-దుర్గి : దేవుని కుమారుడైన యేసుక్రీస్తు జన్మ దినమే క్రిస్మస్ పండుగ అని మాజీ ఎక్టింగ్ బిషప్ వెస్ట్ గుంటూరు సినడు బిషప్, ముటుకూరు ఆంధ్ర ఇవాంజిలికల్ చర్చి పాస్టర్ రెవరెండ్ కటికల యేసుదానం అన్నారు. బుధవారం మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవ మతస్థులు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. తొలుత క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చర్చి డెలిగేట్ మాచర్ల చిన్న పేరయ్య, ఆల్టర్నేట్ డెలిగేట్ కుక్కమూడి ప్రసాదు, ఎక్స్ డెలిగేట్ మాచర్ల సామేలు, పీసీసీ మెంబర్స్, సంఘ పెద్దలు మాచర్ల యోహాను, పులిమెల లాజరు, పులిమెల వెంకయ్య, పులి మెల జక్రయ్య మాచర్ల దేవదానం, మాచర్ల వెంకట్రామయ్య, మాచర్ల మైఖేల్, మాచర్ల పెద్ద అచ్చయ్య, కుక్కమూడి ఏసుదాసు, కుక్కమూడి ఏసోబు, మాచర్ల రవీంద్ర, కుక్కమూడి మరియదాసు, మాచర్ల వసంత్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-విజయపురిసౌత్: సాగర మాత దేవాలయంలో క్రిస్టమస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. క్రీస్తు సందేశాలను సమస్త మానవాళి ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్ జోసెఫ్ తంబి, ఢీకెన్ బాల, సిస్టర్స్, భక్తులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి

విశాలాంధ్ర-దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన కూడళ్లలో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, కొణిజేటి రోశయ్య విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని దాచేపల్లి వాసవీ సేవా సమితి నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కమిషనర్ ఎంవీ అప్పారావును కలిసి వినతిపత్రం అందజేశారు. వారిలో వాసవీ సేవా సమితి వ్యవస్థాపకుడు గరిణే పుల్లారావు, 11 వార్డు కౌన్సిలర్ నాగబండి గురువులు, కామిశెట్టి గురుమూర్తి, కాకుమాను నరసింహారావు, బొడ్డు ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అవమానకరంగా వ్యాఖ్యానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తీరును నిరసిస్తూ బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు ఆధ్వర్యంలో వివిధ దళిత బహుజన ప్రజా సంఘాలు స్థానిక లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశాయి. భారత జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

క్రీస్తు సందేశం ఆదర్శనీయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మాచర్ల: నియోజకవర్గ కేంద్రమైన మాచర్ల మరియు పరిధిలోని పలు మండలాలు, గ్రామాలలో క్రిస్మమస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులంతా ప్రార్థనా మందిరాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి వెల్దుర్తిలోని లూథరన్ ప్రార్థనా మందిరానికి చేరుకొని మత పెద్దల ఆశీర్వాదం పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏసుప్రభువు లోక రక్షకుడని, ఆయన సందేశం సర్వ మానవాళికి ఆదర్శమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెదకూరపాడు : శాంతి, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అచ్చంపేట మండల పరిధిలోని తాళ్ళచెరువు గ్రామంలో ఆర్సీఎం చర్చిలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ ఏసు జన్మించిన ఈ పవిత్ర దినం ప్రతిఒక్కరి జీవితానికి పర్వదినం కావాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నేతలు బత్తుల శ్రీనివాసరావు, నందిని ఆశీర్వాదం, మొక్కపాటి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటపొలాలు

విశాలాంధ్ర-రొంపిచర్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావం వలన మండలంలో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో బుధవారం తెల్లవారుజామున నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షాలు రైతుల కంటి మీద కునుకు లేకుండా చేశాయి. పొలాల్లో కోసిన పడవేసిన వరిఓదెలను కాపాడుకోవడానికి రైతులు పరుగులు తీశారు. వర్షంలోనే వరిఓదెలను పరదాలపై చేర్చి హడావిడిగా నూర్పిళ్ళు చేశారు. వరిగూళ్ళు తడువకుండ టార్పలిన్ పట్టలు, పరదాలు కప్పారు. వరి కోత మిషన్లతో కోసిన వరిధాన్యమును రైతులు గోతాలకు ఎత్తి ఇళ్ళకు చేర్చుకున్నారు. కొన్ని గ్రామాలలో కోతకు వచ్చిన వరి పడిపోయింది. ఈ వర్షాల వలన వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి, మొక్కజొన్న పంటలకు స్వల్పంగా దెబ్బతిన్నదని రైతులు పేర్కొన్నారు. ఈ వర్షాలకు మండలంలో పలు గ్రామాలలో వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జనజీవనం స్థంభించి పోయింది.

వాజ్‌పేయ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - వినుకొండ : భారతరత్న మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్పేయి 100వ జయంతి వేడుకలు స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు, పార్టీ సంస్థగత ఎన్నికల జిల్లా అధికారి పి.వి కృష్ణారెడ్డి, సహాయ అధికారి వెంగల్ రెడ్డి, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ శ్రీనివాసరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్ల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్, అధ్యక్షుడు ఆడిటర్ రాఘవులు తదితరులు పాల్గొన్నారు. వాజ్పేయి జయంతి సుపరిపాలన దినంగా భారతదేశవంతా జరుపుతున్నారని, సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బూతులు గురించి మార్గదర్శనం చేశారు. అన్ని బూతుల్లో కమిటీలు నియమించాలని పేర్కొన్నారు.

కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలు విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

విశాలాంధ్ర-కూచిపూడి: నాట్య రాజధానైన కూచిపూడి కృష్ణాజిల్లాలోని నా నియోజకవర్గంలో ఉండటం, దానికినేను ప్రాతినిధ్యం వహించడం నాకెంతో గర్వకారణమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. ఆయన బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ కూచిపూడి నాట్యాభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి సారించారని వెల్లడించారు . కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం సహకారంతో కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీఈనెల 27 నుంచి 29వతేదీ వరకు నిర్వహించే కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల వేడుకలు విజయవంతానికి నిర్వహిస్తున్న సమిష్టి కృషి అభినందనీయమన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలోతొలిరోజు సాంస్కృతిక ,పర్యాటక, సినిమాటో గ్రఫీశాఖా మంత్రి కందులదుర్గేష్, రెండవ రోజు మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ముగింపు రోజు న ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజులు పాల్గొంటారని వివరించా రు. దేశ విదేశాలలో ప్రాచుర్యం పొందిన కూచిపూడి నాట్యానికి చిహ్నంగా ఏర్పాటుచేసిన పతాకం అరుదైన సంఘటనగా పేర్కొంటూ దానికి 50 సంవత్సరాల ఉత్సవ వేడుకలు నిర్వహించడం ముదావహమని ఆనందాన్నివెల్లడించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నిర్వహిస్తున్న ఈ వేడుకలు విజయవంతానికి సహకారం అందిస్తామని పేర్కొంటూ అహర్నిశలు పాటుపడుతున్న నిర్వాహకుల బృందంను అభినందించారు. కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల ద్వారా కూచిపూడి సంస్కృతి సంప్రదాయాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంగా నిర్వహిస్తున్నఈ కార్యక్రమంలో పాల్గొనటానికి భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచే కాకుండా అమెరికా, రష్యా, జర్మనీ, జపాన్, రష్యా తదితర ప్రాంతాల నుంచి వస్తున్న కళాకారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ముగింపు రోజున రెండువేల మంది కళాకారులతో నిర్వహించే బృందనాట్యం కూచిపూడి చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకొని సువర్ణాలతో లిఖించుకునే అవకాశం లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్.వేదాంతం వెంకట నాగ చలపతిరావు, నాట్య కళా పీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంచికచర్లలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల శ్రీ వెంకటేశ్వర క్లాత్ ఎంపోరియం, రోశయ్య గారి బట్టల దుకాణం 58 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. నందిగామ ఐకాన్ కేర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర క్లాత్ ఎంపోరియం వద్ద బుధవారం జరిగిన వైద్య శిబిరాన్ని రోశయ్య గారి బట్టల దుకాణం యజమాని మండల సుధాకర్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 150 మందికి పైగా వివిధ రకాల కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. .నిర్వాహకులు మండల సుధాకర్ ఆధ్వర్యంలో గత దశాబ్ద కాలంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, కంటి రోగులకు ఎందరికో వైద్య సేవలు అందించారు.

మాధవేంద్రరావుని పరామర్శించిన ఉల్లి కృష్ణ

విశాలాంధ్ర - చల్లపల్లి: చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి పెర్ని మాధవేంద్రరావును ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ ఉల్లి కృష్ణ, నాయకులు పరామర్శించారు. మాధవేంద్రరావు మాతృమూర్తి భోగేశ్వరమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు బుధవారం చల్లపల్లిలోని ఆమె స్వగృహానికి వచ్చి మాధవేంద్రరావు మరియు కుటుంబ సభ్యులను పరామర్శించారు. భోగేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణా జిల్లా కార్యదర్శి ఏ వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమ ప్రకాష్, చల్లపల్లి అధ్యక్షులు తోట సుధాకర్లు పాల్గొన్నారు.

వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలి

-ముడా చైర్మన్ మట్టా ప్రసాద్

విశాలాంధ్ర - గుడివాడ : వాజ్‌పేయి జీవితాన్ని ప్రతి ఒక్కరు, ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ధనియాలపేటలోని ప్రణావశ్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లపర్ల వెంకటేశ్వరరావు అధ్వర్యంలో భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వందవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న పాలకులు అయన గుర్తు పెట్టుకుని పాలన సాగించాలన్నారు. ప్రధానిగా ఉన్న, ప్రతిపక్షంలో ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి గౌరవించే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నరన్నారు. తొలుత మొక్కలను నాటి, ప్రణామ్రశ్రమంలోని ఛత్రలయ విద్యార్థులకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్ర, పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర -పమిడిముక్కల: మండలంలో రెడ్డిపాలెం ఇందిరమ్మ కాలనీ ముదిరాజు పాలెం లో విద్యుత్ లైన్లు కి ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్ములు తొలగించు నిమిత్తం ఉదయం 7గంటలు నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు గమనించాలని ఎ.ఇ.శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర - గుడివాడ : ఆర్‌టిసి బస్సు ఢీ కొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. 1టౌన్ ఎస్ఐ గౌతమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దొడ్డి జగన్‌మోహనరావు(54) బంటుమిల్లి రోడ్డు లోని శివాలయం పూజలు నిర్వహించుకుని బుధవారం ఉదయం వస్తుండగా, ఆర్టీసీ ఏపి 39జడ్0735 ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ గౌతమ్ కుమార్ తెలిపారు. జగన్‌మోహనరావు కుమారుడు గిరిష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తుచేసినట్లు తెలిపారు.

లద్దెపురుగు నివారణపై అవగాహన

విశాలాంధ్ర-కూచిపూడి: 2024-25 సంవత్సరంలో రబీ సీజన్ లో సాగవుతున్న మినుము పైరుకు పొగాకు లద్దపురుగు తీవ్రత అధికంగా ఉండి పైర్‌కు నష్టం జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త (శాస్త్రవేత్త) డాక్టర్ డి సుధారాణి పేర్కొన్నారు. మొవ్వ మండలం కాజ కాద(గ్రామంలో బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయ బీఎస్సీ నాలుగో సంవత్సరం విద్యార్థులు జి.బృహతి, లక్ష్మీ శ్రీజ, నిహారిక, మానస, నాగ జయశ్రీల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ (రావే) కార్యక్రమంలో భాగంగా రైతు భరోసా కేంద్రంలో అపరాల సాగు-యాజమాన్యం పద్ధతులు పై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొనిపలుసూచనలు ఇచ్చారు ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి రైతులకు డెమో తరగతులు నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి నవీన్ పర్యవేక్షణలో కొనసాగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కే రేవతి, డి కృష్ణవేణి, సచివాలయ వ్యవసాయ సహాయకులు షేక్ హుస్సేన్, అభ్యుదయ రైతు పేకేటిసీతా రామిరెడ్డితోపాటు పలు రైతులు పాల్గొన్నారు.

వరి రైతులు ఆందోళన

విశాలాంధ్ర-కూచిపూడి: గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న 15 మిల్లీ మీటర్లకుపైగా కురిసినవర్షపు జల్లులకు కోత కోసి పనలపై ఉన్న రైతుల పరిస్థితి ఆందోళనగా మారింది. బుధవారం కూడా ఉదయం నుంచి జల్లులు పడుతుండడంతో కోత కోసే సమయానికి గింజ రాలిపోయే స్థితికి చేరుకున్న పైరు ఇటీవల సంభవించిన వాతావరణంలో మార్పులతో పాటు కురుస్తున్నజల్లులకు కంకులుపై ఉన్న ధాన్యం మరింత రాలిపోతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జల్లులు మినుము పైరకు ఎంతో లాభదాయకమని వ్యవసాయ అధికారులు స్పష్టం చేశారు.

సైకిల్‌పై శబరిమలకు పయనం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట నుంచి పలువురు అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులు బుధవారం సైకిళ్లపై శబరి మలకు తరలివెళ్లారు. స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం విరుముడుల తో తమ సైకిళ్లు చేతబట్టి యాత్రకు బయలుదేరారు. స్థానిక అయ్యప్ప మండల జ్యోతిపీఠం ఆధ్వర్యంలో సాగిన ఈ యాత్రకు సంఘీభావంగా అయ్యప్ప మాలధారులు పాదయాత్రగా శివాలయం నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా సెయింట్‌థెరిస్సా పాఠశాల వరకు ఊరేగింపు నిర్వహించారు.

పేషెంట్స్ మా మతం, దైవం

విశాలాంధ్ర-మచిలీపట్నం: వచ్చిన పేషెంట్స్ మా మతం, మా దైవమని జిల్లా సర్వేజనా ఆసుపత్రి సూపరింటెండెంట్ డి ఆశాలత వెల్లడించారు. స్థానిక జిల్లా సర్వోజన ఆసుపత్రి వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవం సంఘం రాష్ట్ర కార్యదర్శి, బ్యాంక్ ఎంప్లాయ్ అధ్యక్షుడు, బెల్లంకొండ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగి ంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగం చేస్తున్న సమయంలో అనేకమైన ఇబ్బందులు ఒడు దుడుగులు ఉంటాయని వాటి యొక్క సమస్యలను పరిష్కరించు కునేందుకు ఉద్యోగులకు ఇటువంటి యూనియన్ ఉండడంవల్ల వారి సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆమె అన్నారు. సమస్యలను యూనియన్ పరిష్కరించుకున్నారన్నారు యూనియన్ నాయకులు బెల్లంకొండ కోటేశ్వరరావు మాట్లాడుతూ మన తరఫున ఉన్నత అధికారుల దృష్టికి మన సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించుకునేందుకు ఇ యూనియన్ ఒక నావలాగా ఉపయోగపడుతుందని, అలాగే నేటితో 71 పూర్తి చేసుకుని 72వ సంవత్సరంలోకి అడుగెడుతున్నందుకు చాలా ఆనందంగా ఉన్నదని ఆయన అన్నారు. ఏఐటీయూసీ నాయకులు లింగం ఫిలిప్ మాట్లాడుతూ సమిష్టి కృషితోనే ఏదైనా సాధించగలమని అందుకు యూనియన్ అనేది చాలా అవసరం కాబట్టి ఆ నీడన మనం ఉండి మన హక్కులు సాధించుకోవాలని ఆయన అన్నారు. తొలుత సిపిఐ పార్టీ దిమ్మకు నర్సింగ్ సూపరిటెండెంట్ గ్రేడ్ వన్ రాణి కుమారి పూలమాలవేయిగా, ఏఐటీయూసీ దిమ్మకు నాగేశ్వరమ్మ, అనంతలక్ష్మి లు పూలమాలవేయిగా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జెండా ను డాక్టర్ ఆశలత ఆవిష్కరణ చేశారు. అనంతరం కేక్ కట్ చేసుకుని ఒకరికొకరు ఉద్యోగులు అభినందించుకున్నారు. ఈ కార్యక్రమంలో బత్రాజు రాంబాబు, నర్సింగ్ గ్రేడ్ వన్ బేబీ రాణి ,బేబీ కుమారి, రత్నాకర్, మీనా కుమారి, సుభాన్ ,రెడ్డి , యూనియన్ నాయకురాలు రజిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - గుడివాడ : భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జన్మదిన వేడుకలను స్థానిక బిజెపి కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామినేని వెంకటకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాజ్‌పేయి తన నిబద్ధతతో ప్రపంచ దేశాల ముందు దేశం గర్వించదగ్గ పాలన అందించారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, పట్టణ, నందివాడ అధ్యక్షులు యర్రబోతు అర్జున్, వాసుపల్లి రాంప్రసాద్, జిల్లా నాయకులు సూరే గాంధీ, శనకాయల లీలాకుమారి, శంకరావు, మురళీ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-కూచిపూడి: క్రీస్తు దేవుని కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతోవిరాజిల్లాలని మొవ్వ ఆర్సీఎంచర్చి ఫాదర్ పురపాక జాకబ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన అసిస్టెంట్ ఫాదర్ నవీన్ తో కలిసి నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి (తెల్లవారితే బుధవారం) 12 గంటలకు బాల యేసు కు ప్రత్యేక పూజలు చేసి కొవ్వొత్తులతో స్వాగతించారు. పెదపూడి బేతేలు చర్చిలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ రెవరెండ్ ఫాదర్ అప్పికట్ల ఇమ్మానియేల్, మొవ్వ యేసే జవాబు ప్రాంగ ణంలో నిర్వాహకులైన కృష్ణా జిల్లా పరిషత్ కోప్షన్. సభ్యులు ఫాదర్ రెవరెండ్ వేమూరి పరిశుద్ధ రాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలు అంబరాన్ని తాకాయి. చర్చిలలోసమావేశాలు నిర్వహించి యేసు క్రీస్తు జననంపై ప్రసంగాలు నిర్వహించారు.

పెదపారుపూడిలో...

విశాలాంధ్ర-పెదపారుపూడి: గ్రామ గ్రామాన అన్ని క్రీస్తు దేవాలయాలలో యేసు క్రీస్తు జన్మదినోత్సవ క్రిస్మస్ వేడుకలు క్రైస్తవ సోదరి,సోదరులు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకున్నారు. మండలంలోని మహేశ్వరపురం సి బి సి ఎన్ సి చర్చిలో ఉయ్యూరు వెస్ట్ ఫీల్డ్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ తిరివీధి కరుణశ్రీపీటర్ క్రీస్తు జననం పై సందేశం ఇచ్చారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి మిఠాయిలు, పండ్లు క్రైస్తవులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రీస్తు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విస్సన్నపేటలో...

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవ సోదరులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్సీయం, సీఎస్ఐ, పెంతుకోస్తు తదితర ప్రార్ధనామందిరాల్లో మతబోధకులు ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టి, క్రీస్తు రాకడ, మానవాళికి జరిగిన మంచిని వివరించారు. పెద్దఎత్తున బంధుమి త్రులతో కలసి వేడుకలు జరుపుకున్నారు.

గుడివాడలో....

విశాలాంధ్ర - గుడివాడ : లోకరక్షకుడు నేడు పుట్టెను.. అల్లెలూయ.. ఆమెన్ అంటూ పట్టణంలోని పలు చర్చిలలో బాలయేసు జన్మదిన వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. క్రీస్తు ఆగమనాన్ని స్వాగతిస్తూ పలు దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి గీతాలాపనలు చేశారు. బుధవారం రాత్రి నుండే ఆర్సియం చర్చిలలో క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని మౌంట్ కార్మెల్ ఆర్సిఎం దేవాలయం, కోతిబొమ్మ సెంటర్‌లోని అవిలాపురి చిన్న తేరాజమ్మ ఆర్.సి.ఎం.-2 దేవాలయంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవ విశ్వాసులతో మతాలకు అతీతంగా వేలాది మంది ప్రజానీకం పాల్గొన్నారు. రాత్రి 11 గంటల సమయంలో స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్సిఎం చర్చిలలో ఫాదర్లు గుజ్జుల మైఖేల్, శ్రీకాంత్‌లు, గుడ్‌మన్‌పేట చర్చిలో విచారగురువు ఎం.లూయిస్‌రాజు, బిషఫ్ ప్రొకరేటర్ పాదర్ బోడ్డు ఆనందబాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో సందేశాన్ని అందించి క్రీస్తు జనన పశువుల కొట్టం(స్క్రిబ్) ప్రారంభించి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

పమిడిముక్కలలో...

విశాలాంధ్ర -పమిడిముక్కల: ప్రపంచ మానవాళికి అత్యుత్తమ జీవన వికాసాన్ని చూపించి దైవ కుమారునిగా ఆరాధించబడుతున్న క్రీస్తు మార్గం ఆచరించాలని పలు చర్చిలలో దైవజ్ఞులు ఉపన్యసించారు.బుధవారం క్రిస్మస్ సందర్భంగా మండలంలోని అన్ని చర్చిలలో విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.ప్రతి ఇంటి ముందు క్రిస్మస్ స్టార్ లు ఆకర్షణీయంగా ఉన్నాయి.క్రైస్తవులు బృందాలుగా క్రీస్తు గీతాలను ఆలపిస్తూ గ్రామంలో పర్యటించి మేలుకోలుపు నిర్వహించారు.ప్రతి జీవిని సేవాభావం ప్రేమ దయ తో చూడాలని పాస్టర్లు సూచించారు.పలు చర్చిలలో అన్నాదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘంటసాలలో...

విశాలాంధ్ర - ఘంటసాల : నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించాలని పాపుల జీవితాల్లో వెలుగు నింపడానికే యేసుక్రీస్తు లోకంలో జన్మించారని దైవజనురాలు కావూరి దేవమణి ధనరాజు అన్నారు. ఘంటసాల గ్రామంలోని గిల్గాలు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు దైవజనురాలు కావూరి దేవమణి ధనరాజు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గిల్గాలు చర్చిల్లో పాస్టర్లు కె.దాని యేలు రాజు, నవీన్ బాబు, ప్రేమ్ చంద్, డాని క్రిస్మస్ సందేశం అందించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దైవజనులు, సర్పంచ్ బి. వెంకటేశ్వరమ్మలు క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ఒకరికి ఒకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ముందుగా విశ్వాసులు ఆలపించిన క్రిస్మస్, క్రైస్తవ అధ్యాత్మిక గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అలాగే తాడేపల్లి గిల్గాలు చర్చిలో కె.సతీష్ పాల్, తెలుగురావుపాలెం హొసన్నా మందిర్లో పాస్టర్ కె.దైవ ప్రకాష్ బాబు క్రిస్మస్ సందేశాలు అందించారు. ఈ కార్యక్రమంలో జి.చంటిబాబు, సురేష్, కె.రంగారావు, ప్రసాద్, మేరిమ్మ, రాణిమ్మ, జమున, రమ్య, సుకీర్తి, విశ్వాసులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో....

విశాలాంధ్ర-అవనిగడ్డ: ఏసుక్రీస్తు బోధించిన క్షమా సహనం మానవాళికి ఆదర్శనీయమని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం అన్నారు బుధవారం సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ

వేడుకలకు వెంకట్రాం విచ్చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పర్వదినం క్రైస్తవ సోదరుల జీవితాలలో వెలుగు నింపాలని ఆశా భావం వ్యక్తం చేశారు. క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి మార్గదర్శకాలు అని అన్నారు యేసుక్రీస్తు మార్గంలో ప్రయాణించే ప్రతి ఒక్కరి జీవితంలో ఈ క్రిస్మస్ కోటి కాంతులు నింపాలని వెంకటరామ్ అన్నారు. రెండో వార్డ్ లోని బేతేల్ క్రైస్తవ ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించగా వెంకట్రాం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంత కరుణామయుడు అయిన ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రముఖులు శీలం అశ్విని కుమార్, టిడిపి ఎస్సీ నాయకులు కంచర్ల ఆనంద్ ,పాస్టర్ బొండాడ పాల్ మేయర్, గుడివాక నరహరి, కోట సాయి కృష్ణ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

విశాలాంధ్ర - బంటుమిల్లి : సముద్రతీరప్రాంతాలైన గ్రామాలలోని ప్రజల త్రాగునీటి సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వ పరిపాలన సాగుతుందని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు .మండల పరిదిలోని మల్లంపూడి గ్రామ ప్రజల త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ నిదులనుండి త్రాగునీటి సోంపుకు మంజూరైన 8 లక్షల రూపాయల పనులను బుధవారం శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కాగిత కృష్ణప్రసాద్ మాట్లడుతూ గ్రామీణా ప్రాంతలలోని ప్రజలు త్రాగునీరు ,రహదారుల సమస్యలపై అష్టకష్టలు పడుతున్నారన్నారు .పెడన నియోజకవర్గం సముద్ర తీరప్రాంతం కావడంవల్ల తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు అలాగే గ్రామాలలో అధ్వాన్నంగా ఉన్న

రహదారుల పనులను కుడా త్వరగతిన చేపట్టడం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అద్యక్షులు కూనపురెడ్డి వీరబాబు ,గ్రామ ప్రముఖులు రేవు శ్రీనివాసరావు ,రేవు గోపాలకృష్ణ ,కూటమి నాయకులు ,గ్రామస్తులు పాల్గోన్నారు ..

ముగిసిన పైడమ్మతల్లి జాతర

విశాలాంధ్ర- పెడన:పెడన పైడమ్మతల్లిజాతం మహోత్సవాలను విజయవంతంచేసిన ప్రతి ఒక్కరికి ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావుకృతజ్ఞతలుతెలియజేశారు గ్రామదేవత పైడమ్మ తల్లి జాతర మహోత్సవాలు ముగింపును పురస్క రించుకుని మంగళవారం రాత్రి అమ్మ వారి బ్రహ్మోత్సవం జరిగింది అమ్మవారు పురవీధులు తిరుగు తూ బుధవారం ఉదయం ఆలయానికి చేరుకోగానే అమ్మ వారికి ఉయ్యాలా సేవ నిర్వహించారు. అనంతరం అమ్మ వారిని ఆలయంలో యధా స్థానంలో నిలబెట్టారు. చిన్న పిల్లలను అమ్మవారి ఉయ్యాలా లో కూర్చోబెట్టి అశిస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించిన ఈవో మాట్లాడుతూ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు వివిధ శాఖల అధికారులు భక్తుల అందరి సహకారంతో

జాతర మహోత్సవాలు విజయవంతం అయినదని ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు తెలిపారు వీరందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు అలాగే 2025 జనవరి 5వ తేదీన ఆలయ ప్రాంగణంలో జరిగే భారీ అన్న సమారాధనలో భక్తులందరూ పాల్గొని అన్నప్రసాధారణ స్వీకరించి అమ్మ వారి కృపా కటాక్షాలు పొందాలని ఈవో కోరారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన భవానీ దీక్షల విరమణ

- భవానీ దీక్షా విరమణల్లో అద్భుత ఫలితాలిస్తున్న క్యూఆర్ కోడ్ చైల్డ్ ట్యాగ్
- ఐదు రోజుల్లో తప్పిపోయిన 10 మంది చిన్నారులు
- చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్‌తో తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణలు ఘనంగా ముగిశాయి. చండీహోమం మందిరంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వ హించారు. ఈనెల 21వతేదీన ప్రారంభమైన భవానీదీక్షల విరమణలు హోమగుండంలో భక్తిశ్ర ద్ధలతో దీక్షలను విరమించా రు. జై భవానీ, జైజై భవానీ చివరి రోజు అమ్మవారి నామస్మరణలతో ఇంద్రకీలాద్రి దేవస్థానం మార్మోగింది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. కోరిన కోరికలు తీర్చే అమ్మవారిని దర్శించుకుని భక్తులు మధురానుభూతిని పొందారు. అన్ని ప్రభుత్వశాఖలతో సమన్వయంతో దీక్షలను విజయవంతం చేయగలగామని ఆలయ ఈవో కేఎస్.రామారావు తెలిపారు.గత సంవత్సరం 3,20,000 మంది భక్తులు రాగా, ఈ ఏడాది 3,70,000 మంది భవానీ భక్తులు దీక్షల విరమణలు చేశారు. చివరి రోజు కావడంతో ఇంద్రకీలాద్రి పై భక్తులు పోటెత్తారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ప్రభుత్వశాఖల అధికారులు చర్యలు తీసుకున్నారు.

చిట్టి చేతులు గట్టి గ్యాగ్...

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చొరవతో ఈసారి భవానీ దీక్షా విరమణల్లో ప్రవేశపెట్టిన చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎస్) క్యూఆర్ కోడ్ చైల్డ్ ట్యాగ్ అద్భుత ఫలితాలిస్తోంది. ఐదు రోజుల్లో తప్పిపోయిన మొత్తం పదిమంది చిన్నా రులను ఈ సాంకేతికత సహాయంతో తల్లి దండ్రులు చెంతకు సురక్షితంగా చేర్చారు. భవానీ దీక్షా విరమణల సందర్భంగా దుర్గమ్మ ఆల యాన్ని సందర్శించేందుకు వచ్చే అయిదేళ్లలోపు పిల్లల చేతికి క్యూఆర్ కోడ్ ట్యాగ్‌లను జిల్లా యంత్రాంగం వేస్తోంది. ఐసీడీఎస్ విభాగం నుంచి దాదాపు 60 బృందాలు రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, సిటీ ఎంట్రీ పాయింట్లు, క్యూలైన్లతో సహా వివిధ ప్రదేశాలలో చిన్నారులకు

క్యూఆర్ కోడ్ రెస్ట్ బ్యాండ్‌ను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యాయి. బ్యాండ్‌ను చేతికి కట్టే సమయంలో మొబైల్ నంబర్‌తో సహా పిల్లలు, తల్లిదండ్రుల వివరాలను క్యూఆర్ కోడ్‌లో నిక్షిప్తం చేసి సర్వర్‌లో సేవ్ చేయడం జరుగుతోంది. ఒకవేళ పిల్లలు తప్పిపోయినట్లయితే, ఆ పిల్లలను గమనించిన వారెవరైనా ట్యాగ్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పిల్లల పేరు, తల్లిదండ్రుల పేరు, తల్లిదండ్రుల ఫోన్ నంబర్, తల్లిదండ్రులకు ఫోన్ చేయడానికి లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించడానికి ఆప్షన్లు కనిపిస్తాయి. దీంతో చాలా తేలిగ్గా తల్లిదండ్రులకు కాల్ చేసి పిల్లలను అప్పగించొచ్చు. ఈసారి కార్యక్రమంలో దాదాపు 12,000 మంది పిల్లలను ట్యాగ్ చేశారు. 10 మంది పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు విధి నిర్వహణలో ఉన్న పోలీసులు అప్పగించినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విశాలాంధ్ర-గన్నవరం:ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని ఏపీ ప్రభుత్వ విప్ , గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం విజయవాడ లోని తన క్యాంప్ కార్యాలయం నందు గన్నవరం నియోజకర్గం లో వివిధ ఆరోగ్య కారణాలతో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్న మానికొండకు బెజవాడ కృష్ణారావుకు రూ. 60,000 , సున్న గ్రామానికి చెందిన మాణిక్యంకు రూ. 2,25,000 ముఖ్యమంత్రి మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దరఖాస్తు చేసు కున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నారని అన్నారు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పేర్నిని పరామర్శించిన ఉల్లి కృష్ణ

విశాలాంధ్ర - చల్లపల్లి: చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావును ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ ఉల్లి కృష్ణ పరామర్శించారు. మాధవేంద్రరావు మాతృమూర్తి భోగేశ్వరమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు బుధవారం చల్లపల్లిలోని ఆమె స్వగృహానికి వచ్చి మాధవేంద్రరావు మరియు కుటుంబ సభ్యులను పరామర్శించారు. భోగేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కృష్ణా జిల్లా కార్యదర్శి ఏ వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమ ప్రకాష్, చల్లపల్లి అధ్యక్షులు తోట సుధాకర్లు పాల్గొన్నారు.

వాజ్‌పేయి జీవితం యువతకు ఆదర్శనీయం

విశాలాంధ్ర - చల్లపల్లి: విలువలు కలిగిన వ్యక్తి వాజ్ పాయ్ అని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొ న్నారు.భారత మాజీ ప్రధాన మంత్రి,భారత రత్న అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి సంద ర్భం గా చల్లపల్లిలో సంఘ కార్యాల యంలో బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా దేశంలో విలువలకు ప్రాధాన్యత ఇచ్చి దేశ ప్రయోజనాలు,సమాజ అభివృద్ధి కోసం జీవితాన్ని గడిపిన నేత వాజ్‌పేయి అని సురేష్ బాబు కొనియాడారు. ఆయన జీవితం యువతకు వాజ్ పాయ్ జీవితం ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు మేడేపల్లి సుబ్బారావు, కారుమూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపే జాబ్ మేళా

విశాలాంధ్ర-అవనిగడ్డ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పన శాఖ డిఆర్డిఏ సీడ్ ఆఫ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం గాను ఈనెల 27వ తారీకు శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి విక్టర్ బాబు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి నరేష్ కుమార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి ఉమారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7995534572 కానీ 8790118349 కానీ సంప్రదించాలని అన్నారు.

ఏసు జీవనం అందరికీ ఆదర్శప్రాయం

విశాలాంధ్ర- పెడన: పట్టణం ఒకటో వార్డు దైవ కృపా మినిస్ట్రీస్ (ప్రార్థన మందిరం) లో క్రిస్మస్ వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య పాల్గొని క్రైస్తవ సోదరీ సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగాఆయనమాట్లాడుతూ క్రీస్తు ప్రేమను చూపడమే నిజమైన క్రిస్మస్ అని దైవ కుమారుడు జీసస్ మానవునిగా జన్మించిన రోజును ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగ జరుపుకుంటారని ఏసుప్రభు జీవనం అందరికీ ఆదర్శప్రాయమని తెలియజేశారు. బుల్లయ్య మా ట్లాడుతూ నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని అన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ , కొనకళ్ళ బుల్లయ్యలను దైవ కృపా మినిస్ట్రీస్ దైవ సేవకులు లేమయేలు పుష్ప గుచ్చాలు అందజేసి శాలువా తో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో వార్డ్ కౌన్సిలర్ బల్ల పద్మావతి, 21వ వార్డు కౌన్సిలర్ పిచ్చుక.సతీష్ సంఘ విశ్వా సులు సంఘ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిరంతరాయంగా మంచినీరు అందించటమే లక్ష్యం

పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : పశ్చిమ నియోజక వర్గంలో ప్రతి ఒక్కరికీ నిరంతరాయంగా మంచి నీరు అందించటమే లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. పశ్చిమ నియోజక వర్గంలోని 40వ డివిజన్ లారీ స్టాండ్ వద్ద రూ. 3.30 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా నిర్మించిన 1500 కిలో లీటర్ల సామర్థ్యం గల రిజర్వా యర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పశ్చిమ నియోజకవర్గం ప్రజలకు తాగునీటి సరఫరాల సమస్యలను దూరం చేసేందుకే రెండవ రిజర్వాయర్‌ను పశ్చిమలో నిర్మించినట్లు 39, 40, 42వ డివిజన్ల ప్రజలకు త్రాగునీటి సౌకర్యం ఈ రిజర్వాయర్ ద్వారా వస్తుందని, దాదాపు 20వేలు ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. ఇప్పటివరకు కేవలం ఒక్క రిజర్వాయర్ ఉండటం వల్ల పశ్చిమలోని ప్రజ లకు వివిధ సమయాల్లో తాగునీటి సరఫరా జరిగే దని కానీ ఇప్పుడు రెండవ రిజర్వాయర్ నిర్మాణం వల్ల పశ్చిమ నియోజకవర్గం ప్రజ లందరికీ ఒకే సమయంలో తాగునీటి సరఫరా జరుగుతుంద న్నారు. కార్పొరేటర్లు అంజనేయరెడ్డి, గుడివాడ నరేంద్ర, ఇర్ఫాన్, మరుపిళ్ళ రాజేష్, అర్షద్, డీఈఈ కరుణా కర్‌బాబు, ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

లక్ష్మీకాంత కవి జయంతోత్సవం

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : శ్రీ సత్య హరిశ్చంద్ర యము నాటకాన్ని రచించి లక్షల ప్రదర్శ నలు వేల మంది కళాకారులకు జీవనోపాధి క ల్పించిన కీర్తిశేషులు బలిజేపల్లి లక్ష్మీకాంత కవి 143వ జయంతోత్సవము జగ్గయ్యపేట ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యాలయంలో శ్రీ సూర్య తేజ నాట్య మండలి రంగస్థల నటులు పంచాది రమణావు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో నాటక రంగంపై పరిశోధనలు జరిపి గౌరవ డాక్టరేట్ పొందిన నిభానుపూడి సుబ్బరాజు,తెలుగు సాహి తీవేత్త, ప్రవచకులు,పాంచ జన్య,డాక్టర్ వడ్డేపల్లి శ్రీనివాసరావు, కళాకారులు నంబూరి చలపతిరావు మరియు జగ్గయ్యపేట శ్రీ కళా వేదిక కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రముఖ కవి బత్తుల బ్రహ్మయ్య, ప్రముఖ కవి సరికొండ నరసరాజు, సీనియర్ కళా కారుడు విశ్రాంత ఉపాధ్యాయులు గుదే సూర్య నారా యణరావు పాల్గొన్నారు.అనంతరం కళాకా రులందరూ ఆలపించిన శ్రీ సత్య హరిశ్చంద్ర నాటకం లోని పద్య పఠనం పలువుర్ని అలరించింది.

డాక్యుమెంట్ పోయినది

విజయవాడ అరండల్‌పేట రహమాన్ వీధి, డోర్ నెం. 28-22-3లో నివసిస్తున్న యండి. సూఫి గారి తల్లి బదరున్నీసాకు చెందిన ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 4927/ 1978 గల ది. 24-12-2024న అరండల్‌పేట విజయటాకీస్ సెంటర్ వద్ద డాక్యుమెంట్ ఉన్న సంచి పోయినది. దొరికిన వారు క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
సెల్ : 9849137860

తెలుగు వెలుగే మహాసభల లక్ష్యం

- విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభలు
- ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహణ
- యువతకు అధిక ప్రాధాన్యం
- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విశాలాంధ్ర-అవనిగడ్డ: తెలుగు భాషకు వెలుగులు అద్దడమే లక్ష్యంగా ప్రపంచ తెలుగు రచయితల 6వ మహాసభలను నిర్వహించ తలపెట్టినట్టు మాజీ ఉపసభాపతి, ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. విజయవాడలోని కాకరపర్తి భావన్నారాయణ (కేబీఎన్) కళాశాల కేంద్రంగా ఈ నెల 28, 29 తేదీల్లో ఆరో మహాసభలను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఏ మాతృభాష అయినా మృత భాష కాకుండా ఉండాలంటే నేటి తరంపైనే ఆధారపడి ఉందన్నారు. అందుకే యువతకు ఈ సభల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ కూడా చాలా కీలకమనే అంశాన్ని సభల ద్వారా ముందుకు తీసుకెళ్తామన్నారు. రెండు రోజులు జరిగే మహాసభల సభా ప్రాంగణానికి అమర జీవి పొట్టి శ్రీరాములు పేరు, కార్యక్రమాలు జరిగే ప్రధాన వేదికకు 'ఈనాడు' సంస్థల అధినేత దివంగత రామోజీరావు పేరు పెడుతున్నట్లు తెలి పారు. తెలుగు రాష్ట్రం, భాష కోసం జీవితాంతం కృషి చేసిన ఈ ఇద్దరు మహనీయులను స్మరించుకునేందుకు ఇదో గొప్ప అవకాశమన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణా జిల్లా రచయితల సంఘం, కె.బి.ఎన్. కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరో మహాసభలను డిసెంబర్ 28న సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ ప్రారంభిస్తారన్నారు. ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణరాజు, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి, మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్ శైలజా కిరణ్ తదితర ప్రముఖులు ప్రారంభోత్సవానికి హాజరవుతున్నట్లు వెల్లడించారు. తెలుగు భాష, సాహిత్యాలను ఆధునీకరించే లక్ష్యంతో ఈ మహాసభలు నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా 'మార్పు' పేరుతో 500 పుటల ప్రత్యేక ప్రచురణను వెలువరించనున్నట్లు చెప్పారు. మహాసభల్లో భాగంగా రామోజీరావు ప్రధాన వేదికతో పాటు మరో రెండు వేదికలపై తెలుగు వెలుగుల సభలు, శాస్త్ర సాంకేతిక సదస్సు పత్రికా సంపాదకులు-సీనియర్ పాత్రికేయుల, ప్రసార రంగాల,మహిళా సదస్సు, సాంస్కృతిక రంగ, రాజకీయ ప్రతినిధుల, సాహితీ సంస్థలు, ఇతర రాష్ట్రాల ప్రతినిధుల సదస్సులు యువకవులతో సమ్మేళనం, శత జయంతి కార్యక్రమాలు జరుగుతాయని ఆయన ప్రకటించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల్లో స్థిరపడిన రచయితలు, కవులు, మాతృ భాషాభిమానులు పెద్దఎత్తున మహాసభల్లో పాల్గొంటారన్నారు. ఇప్పటి వరకు 1200 మంది ప్రతినిధులు, 300 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని, 100 మందికి పైగా అతిథులు పాల్గొంటున్నారని వెల్లడించారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్, ఎస్ కేవీపీ హిందూ హైస్కూల్స్ కమిటీ పరిపాలన అధికారి (ఏవో) డాక్టర్ వంగల నారాయణరావు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

దివ్యబలి పూజ సమర్పణ

విశాలాంధ్ర -పెనమలూరు: కానూరు కార్మెల్ మాత పుణ్యక్షేత్రంలో క్రీస్తు జన్మదిన వేడుకలు విచారణ గురువులు ఫాదర్ చలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. దివ్య బలి పూజలో గంగూరు, సాలిపేట, పోరంకి, కామయ్యతోపు, కానూరు, వివిధ ప్రాంతాలనుంచి భక్తులకు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అతి పెద్దగా ఏర్పాటు చేసిన పశువుల పాక పదిహేను అడుగుల క్రిస్మస్ తాత అలంకరణలు అందరిని ఆకట్టుకున్నాయి. దివ్య బలి పూజలో పాల్గొన్న విశ్వాసులకు దివ్య ప్రసాదం అందించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఫాదర్ రత్నరాజు తనకు తాను తగ్గించుకొని మానవుడు దేవుని కుమారుడిగా పుట్టి శాంతి స్వరూపుడు యావత్ ప్రపంచం మొత్తం క్రిస్మస్ పండుగ సంతోషముగా జరుపుకుంటున్నారన్నారు. ఫాదర్ దేవదానం దివ్యబలి పూజను సమర్పించారు. విచారణ గురువులు ఫాదర్ చలివేంద్ర శౌరి చిన్నారి బాల యేసును ఆశ్వీరోదించి ప్రదర్శన తో పశువుల పాకలో ఏర్పాటుచేశారు. రాత్రి నుండి తెల్లవారి జాము వరకు భక్తికరమైన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు వెయ్యి మంది పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను సిటిసి సిస్టర్స్, ఉపదేశకులు, గాయక బృందం, మరియు దళ సభ్యులు, యూనిట్ లీడర్స్, క్యాటీకిజం టీచర్స్, యూత్ సభ్యులు సమర్ధవంతంగా నిర్వహించారు. అందరికి కార్మెల్ మాత పుణ్యక్షేత్రం ఫాదర్ చలివేంద్ర శౌరి క్రీస్తు జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అందరికి ఫ్రూట్స్, కేకులు పంచిపెట్టారు.

ప్రసూన రామన్‌కు సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ప్రణవి మ్యూజికల్ అకాడమీ 6వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న చిత్ర గీతాల వారోత్సవంలో నాల్గో రోజు బుధవారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై జ్యోతిష్య రత్న ప్రసూన రామన్ కు ఘన సత్కారం జరిగింది. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కారుమంచి రాజు నేతృత్వంలో మేకప్ రాజు పర్య వేక్షించారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలను అతి థులు ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి అంజలి ఘటించారు. అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర బిజెపి నాయకులు కిలారు దిలీప్, అద్దూరి శ్రీరామ్ లు, డేవిడ్ రాజు, బివి వీరభద్రరావు, పరుచూరి విజయలక్ష్మి, తదితర పాల్గొన్నారు. సినీ సంగీత విభావరి శ్రోతలపై స్వరాల పూల జల్లును కురిపిస్తూ సాగింది.

జీవో 77ను రద్దు చేయాలి:ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ దాసరి నాగభూషణం భవన్ నందు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి. వలరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వలరాజు మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 3,580 కోట్ల రూపాయల ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత పీజీ విద్యను దూరం చేసే జీఓ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు, వైఎస్ఆర్ఎస్‌యు, ఏఐఎస్ఎ, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. కృష్ణాజిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి సాత్విక్, గుడివాడ అధ్యక్షుడు రెహమాన్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 27,28,29 తేదీల్లో జిల్లాలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, ప్రెస్‌మీట్‌లను నిర్వహించాలని, డిసెంబర్ 30వ తేదీన విజయవాడలో అన్ని విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు జి వలరాజు తీర్మానించారు. ప్రభుత్వం నుండి రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ లను విడుదల చేసేవరకు, జీఓ 77ను రద్దు చేసే వరకు పోరాటం సాగిస్తామని తెలిపారు.

మానవాళిని సత్యపథం వైపు నడిపించేది ఏసుక్రీస్తు

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : క్రిస్మమస్ పర్వదినం సందర్భంగా పట్టణంలోని క్రిస్టియన్ పేట నందు క్రిస్టియన్ సోదరులు ఏర్పాటు చేసిన పశువుల పాకలను ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను సందర్శించి కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సంద్బంగా ఉదయభాను మాట్లాడుతూ ప్రపంచంలో క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ అత్యంత పవిత్రమైన పండుగ క్రిస్మమస్ పండుగ అని,కరుణ,ప్రేమ,దాతృత్వం,త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలు అని అన్నారు.మానవాళిని సత్యపథం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారు అని తెలిపారు.అనంతరం తోట బజార్ నందు జనసేన పార్టీ నాయకులు సోమవరపు నాగమల్లేశ్వరరావు (అదితి బాబు) ఏర్పాటుచేసిన ప్రార్ధన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, మున్సిపల్ కౌన్సిలర్లు పాకలపాటి డేవిడ్ రాజు, కొలగాని రాము, జనసేన నాయకులు ముత్యాల జార్జి, అల్లూరి భాస్కర రావు, చారుగుండ్ల కొండా, గోగిశెట్టి మహేశ్వరరావు, చిట్టిపోతుల సత్యనారాయణ, మాదాల వీరయ్య చౌదరి, నల్లపునేని వెంకట నారాయణ, ఆవాల భవానీ ప్రసాద్, సామినేని లక్ష్మి నారాయణ, రాంబాబు, చిన్ని కృష్ణ పాల్గొన్నారు.

కాపు ప్రతినిధుల సభకు ఎమ్మెల్యే మండలికి ఆహ్వానం

విశాలాంధ్ర-అవనిగడ్డ: కాప్స్ రాక్స్ కృష్ణాజిల్లా అడ్మిన్స్ టీమ్స్ ప్రతినిధులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ను కలిశారు. ఈనెల 29వ తేదీ ఆదివారం విజయవాడలో జరగబోయే కాపు ప్రతినిధుల సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట రామ్ లను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మండల టిడిపి, జనసేన పార్టీల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గుడివాక శేషబాబు, జనసేన నాయకులు బచ్చు శ్రీహరి కాప్స్ రాక్స్ కృష్ణాజిల్లా అడ్మిన్ టీమ్స్ సభ్యులు పాలంకి రామారావు, పత్తి మహేష్, అవనిగడ్డ మండల కాప్స్ రాక్స్ అడ్మిన్స్ పరచూరి సురేష్, అద్దంకి ధనుంజయలతో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తి,శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : క్రీస్తు బోధనలు ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయని, ఎమ్మెల్యే శ్రీరాంరాజగోపాల్ తాతయ్య తెలిపారు.బుధవారం నాడు క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్‌పేటగ్రామం సాయిబాబా గుడి క్రాస్ రోడ్ సమీపంలో గెలీలియో బాప్టిస్ట్ మినిస్ట్రీస్ చర్చ్ నందు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజగోపాల్ హాజరయ్యి ప్రత్యేక ప్రార్ధనలు చేసి క్రిస్మస్ కేకు ను కట్ చేసి క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోని చాలా దేశాలలో అత్యంత వైభవంగా జరుపుకునే అతి పెద్ద పండుగ క్రిస్మస్ అని,ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు దీన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారని,జీసస్ జన్మించి నేటికి రెండు వేల ఏళ్లు దాటినా కరుణామయుడుగా,దయామయుడుగా ఆయన క్రైస్తవుల ఆరాధనలను అందుకుంటున్నాడు.ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైవస్తవులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ క్రిస్మస్ అని,ఆ యేసు ప్రభువు ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి కూడా ఆ ప్రభువు ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో షేర్ మహమ్మద్ పేట నాయకులు, కార్యకర్తలు, క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

-చలసాని రమేష్ చౌదరి

విశాలాంధ్ర-పెదపారుపూడి: తెలుగు దేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు టిడిపి సీనియర్ నేత సూరపనేని వెంకట సత్యనారాయణ లు మండల ప్రజలకు ముఖ్యంగా క్రైస్తవ సోదరీ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపినట్లు ఒక ప్రకటనలో బుధవారం వివరించారు.